

72 గంటల బంద్‌ను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఈనెల 2,3,4 తేదీల్లో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల బంద్ చేపడుతున్నామని, దీన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికందర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బంద్ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 7200కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పై చదువులకు వెళ్లలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్, అన్వేష్, తిరుపతి, సిద్ధు, అంజి, విద్యార్థులు వైష్ణవి, రాజేశ్వరి, తిరుమల, సింధు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యాలయ ప్రత్యేకాధికారిగా భాగ్యలక్ష్మి

దండేపల్లి జూలై 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేక అధికారిగా ఆర్. భాగ్యలక్ష్మి (ఎస్‌వో) పూర్తి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్‌వో మంజులపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి కలెక్టర్ కుమార్ దీపక్‌కు నివేదిక అందజేశారు. ఇప్పటి వరకు కేజీబీవి స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన పి మంజులను విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విద్యాలయంలో సీఆర్‌టిగా పని చేసిన భాగ్యలక్ష్మి కేజీబివి విద్యాలయ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

నస్పూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 2న బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సీసీసీ-శ్రీరాంపూర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగుంట చంద్రశేఖర్, క్యాంప్ చైర్మన్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 50ఏళ్లు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఆపరేషన్ అవసరమైనా వారిని 3వతేదిన రేకుర్తి ఆసుపత్రికి తరలించి ఆపరేషన్లు ఉచితంగా చేపిస్తామన్నారు.

- కార్యరూపం దాల్చని సీసీ కెమెరాల ఏర్పాటు
- అమలుకాని బయోమెట్రిక్ విధానం
- కొత్తగా ఫొటో క్యాప్చర్ విధానానికి శ్రీకారం
- అసలు లబ్ధిదారులకే సరుకులు అందేలా చర్యలు
- జిల్లాకు 32 సొంత భవనాల మంజూరు



అంగన్‌వాడీలో అక్రమాలకు చెక్ పడేనా..?

మంచిర్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలుత అంగన్ వాడీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. అక్కడక్కడ కొన్ని కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లు, సిబ్బంది చేతివాటంతో పిల్లలు, మహిళలకు అందాల్సిన గుడ్లు, పాలు, పప్పు, తదితర సామగ్రి బహిరంగ మార్కెట్‌లో దర్శనమిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పలు ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నామ మాత్రంగా నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రాలకు వచ్చిన సరుకులు, విద్యార్థులు హాజరు సహా అంగన్‌వాడీని పూర్తిగా పరిశీలించేలా కొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ సంవత్సరం గడిచినా అది కార్యరూపం దాల్చలేదు. మరోవైపు బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని అనుకున్నప్పటికీ అదీ సాధ్యపడలేదు. ప్రస్తుతం కొత్తగా ఫొటో క్యాప్చర్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఫొటో క్యాప్చర్‌తో అక్రమాలకు అడ్డుకట్ట ..!

అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేదుకు ప్రభుత్వం ఫొటో క్యాప్చర్ అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ నెల 1 నుంచే అన్ని కేంద్రాల్లో ఫొటో క్యాప్చర్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు రాకపోయినా... వచ్చినట్లు హాజరు వేస్తూ అక్కడి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజువారి ఆహారం కూడా వడ్డించడం లేదనే ప్రచారం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంత మంది పిల్లలు వస్తున్నారు..? వారికి ఏమి నేర్పుతున్నారు..? బాలింతలు, గర్భిణులు వస్తున్నారా..? వారికి మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా...?లేదా..? అనే విషయాలపై ఎప్పటికప్పుడు.. (తరువాయి 5లో)

జిల్లాకు 32 భవనాలు మంజూరు...

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాలు ఏర్పా టు చేసేందుకు కూడా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాకు 32సొంత భవ నాలు మంజూరయ్యాయి. జిల్లాలోని16 మండలా లకు గాను ఒక్కో మండలానికి రెండేసి భవనాల చొప్పున మొత్తం 32భవనాలు పైలట్ ప్రాజెక్టు కింద మంజూరయ్యాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో ఒక్కో భవన నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి...అద్దె భవనాల్లో ఎన్ని ఉన్నాయి..ఎంత మంది టీచర్లు, సిబ్బంది ఉన్నారు...పిల్లలు, గర్భిణులు, బాలింతలు సంఖ్య ఎంత అనే పక్కా సమగ్ర సమాచారాన్ని రాష్ట్ర శిశు సంక్షేమశాఖ అధికారులు జిల్లా అధికారుల నుంచి ఇప్పటికే సేకరించారు. జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేటలో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఈ కేంద్రాలను నిర్వ హిస్తున్నారు. ఇప్ప టికే భవనాలకు స్థలాల ఎంపిక పూర్తికాగా, త్వర లో పనులు చేపట్టేందుకు సన్నాహాలు జరుగు తున్నాయి. అయితే కేవలం 32భవనాల నిర్మాణం తోనే సరిపెడతారా...? లేక అన్ని అంగన్‌వా డీలకు సొంత భవనాలు మంజూరు చేస్తారా...? అన్న విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టతలేదు. అయితే జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేస్తే ఇబ్బందులు లేకుండా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సిగాచి ప్రమాదంలో దండేపల్లి వాసి మృతి
- స్వగ్రామంలో విషాదం
4

విద్యార్థుల భవితకు 'నవోదయ'ం
- దరఖాస్తులకు ఈనెల 29 తుది గడువు
- డిసెంబరు 13న ప్రవేశపరీక్ష
4

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- డీఈవో యాదయ్య



చింతగూడ పాఠశాలలో విద్యార్థులతో చదివిపిస్తున్న డీఈవో యాదయ్య

కాసిపేట, జూలై1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లను అత్యధికంగా నమోదు చేసి విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో యాదయ్య సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని జడ్పీహెచ్ఎస్ ముత్యంపల్లి, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలతో పాటు వరిపేట, చింతగూడెం, ఎంపీపీ పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో విద్యా ర్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. ముత్యంపల్లి పాఠశాల పగుళ్లతేలి ప్రమాదకరంగా ఉండడంతో కొత్త బిల్డింగ్ మంజూరుకోసం మాట్లాడుతానన్నారు. మోడల్‌హాస్టల్, కేజీబీవీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోడల్ కాలేజీ హాస్టల్ నిర్వహణకు వస్తున్న ఆరోపణపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ కేర్‌టేకర్‌పాటు, కేజీబీవీ ఎస్‌వో సమన్వ యంతో పని చేయాలన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అలాగే కేజీబీవీలో కొత్తమెనూ ప్రకారం భోజనాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట ఎంఈవో వెంకటేశ్వరస్వామి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖలీల్, కేజీబీవీ ప్రత్యేకాధికారి సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి స్థలాల్లోని పేదలకు పట్టాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లిపై కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాలలోనిపార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లా డారు. ఇటీవల సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రఘునాద్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం తలపెడితే పాల్గొనడానికి వెళ్తున్న బాధితులను స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పట్టాలు ఇస్తామని హామీఇచ్చి మర్చిపోయిందన్నారు. ఈసమా వేశంలో నాయకులు రాజ్‌కుమార్, రమేష్, వెంకటేశ్వర్‌రావు, హరికృష్ణ, చక్రి, రాకేష్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, దేవేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



మాతా శిశు కేంద్రంలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని గోదావరి రోడ్డులోని మాతా శిశు కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కీర్తిశ్రీ, ప్రశాంతి, గిరిబాబు, సురేందర్‌రెడ్డి, శ్రీధర్‌లను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, ప్రభుత్వఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్ర రెడ్డి, ఆర్ఎంవో భీష్మలు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు శ్రీధర్, లయన్స్‌క్లబ్ సభ్యులు సుగుణాకర్‌రెడ్డి, రామస్వామి, మధు సూదన్‌రెడ్డి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

- జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం మంచిర్యాలలోని రెడ్‌క్రాస్ సొసైటి రక్తనిధి కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వైద్యులు ప్రియాంక సక్సేనా, సురేష్‌బాబు, స్పందనలను ఘనంగా సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటి జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జ న్మనిస్తారని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, కిషన్, నారాయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్రం వచ్చినా దళితుల బతుకులు మారలేదు

- దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్



దళిత హక్కుల పోరాట సమితి నాయకుల సమావేశం

హాజీపూర్, జూలై1 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్య్రం వచ్చి 77ఏళ్లు గడుస్తున్నకాని దళితుల బతుకులు మారలేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రకార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల నంనూర్ గ్రామ మాజీ సర్పంచ్ దేవి లక్ష్మీ ఇటీవల మృతి చెందగా వారి కుమారుడైన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచంను మంగళవారం దళితహక్కుల నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా గుడిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం దళితులకు అంబేద్కర్ అభయహస్తం పేరుతో అర్హులైన ప్రతి కుటుంబా నికి 12లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో విఫలమైందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు లక్ష కోట్ల రూపాయలు దారి మళ్లించిందన్నారు. దళితులకు వచ్చే నిధులను ఇతరులకు మళ్లించకుండా దళితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు బోయిని అశోక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. రాజరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు మారుపెల్లి రవి, జిల్లా సహాయ కార్యదర్శి గజ్జెల తిరుపతి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మొగిలి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



పోగొట్టుకున్నసెల్‌ఫోన్‌లను అందజేస్తున్న సీఐ శశిధర్, ఎస్ఐ

మందమర్రి, జూలై1 (ఆంధ్రజ్యోతి): మందమర్రి సర్కిల్ పరిధిలో పోగొట్టుకున్న ఏడుగురు బాధితులకు సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐరాజశేఖర్‌లు వారికి అందజేశారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. రామగుండం పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఆధునిక సాంకేతికను ఉపయోగించి నేరాలనియంత్రణతో పాటు ఆస్తులరికవరిలో ప్రణాళిక బద్ధంగా పని చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సీఈఐఆర్ ద్వారా 200 ఫిర్యాదు నమోదు అయ్యాయని, దీనిలో 80శాతం తాము రికవరి చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా ఫోన్‌ను పోగొట్టుకున్న లేక దొంగతనానికి గురైన ఆందోళన పడవద్దని తెలిపారు. గుర్తు తెలియని తక్కువ ధరకు ఫోన్‌ను అమ్మితే ఎవరు కొనుగోలు చేయవద్దని అమ్మిన వ్యక్తుల వివరాలను పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. దొంగతనాలను అరికట్టడానికి మందమర్రి సర్కిల్ పరిధిలో ప్రత్యేక పోలీసు పెట్రోలింగ్ బృందాలు తిరుగుతున్నాయన్నారు. సంతలో పాటు జనవాసాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు అమర్చామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

- కలెక్టర్ కుమార్ దీపక్

కన్నెపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరు గైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ కుమా ర్‌దీపక్ అన్నారు. మంగళవారం మండలంలోని చెర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరే ట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్య అందుతుందన్నారు. అనంతరం మం డల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కన్నె పల్లిలోని కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్‌లు, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. మెను ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందించా లని, ఆహారం తయారీలో నిబంధనలు, శుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరగా నిర్మాణాలను ప్రారంభించాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. విద్యతో పాటు నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్యను వెంటనే పరిష్కరించి నీటిని అందించాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఎత్తు, బరువు కొలతలను స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శి రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కన్నెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును పరిశీలిస్తున్న కలెక్టర్

అభివృద్ధి పనులకు ఇసుకను వేగంగా అందించాలి

మంచిర్యాల కలెక్టరేట్ : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుకను త్వరగా అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో నీటి సరఫరా, రోడ్లు భవనాలు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుకను టీజీఎండీసీ ఆధ్వర్యంలో అందించాలని, పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. పనులకు అవసరమైన కంకరను జీరో పర్మిట్ సిస్టమ్ ద్వారా వాహనాలకు వేబిల్ ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

మందమర్రిలో భారీ వర్షం

- రోడ్లపై నిలిచిన నీరు
- ఓసీపీల్లో ఉత్పత్తికి అంతరాయం

మందమర్రిటౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మందమర్రి మండల వ్యాప్తం గా మంగళవారం ఎడ తెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. మధ్యాహ్నం నుంచి చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం సాయంత్రానికి పెరిగింది. దీంతో స్థానిక సీఈఆర్ క్లబ్ వద్ద గల పాలవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. అదే విధంగా పాలచెట్టు ఏరియాలో రోడ్లపై నుంచి నీరు ప్రవహించింది. స్థానిక రెండవ జోన్‌లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. కూరగాయల మార్కెట్ వర్షానికి నిర్మానుష్యంగా మారింది.

ఓసీపీల్లో ఉత్పత్తికి అంతరాయం

కేకే ఓసీపీ, ఆర్కే ఓసీపీల్లో వర్షంతో ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఎప్పటి కప్పుడు వర్షం నీరు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే ఉత్పత్తికి కొంత అంతరాయం ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు.

జన్నారంలో...

జన్నారం: జన్నారం మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. వారసంతకావడంతో మండల వాసులతో పాటు వారసంతకు వచ్చిన వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీలన్ని బురదమయ్యాయి. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని గొర్లకాపరులతో పాటు పశువులను గోదావరిలోకి పంపకూడదని హెచ్చరించారు.



మందమర్రిలో రోడ్లపై నిలిచిన వర్షం నీరు

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

చెన్నూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని డిప్యూటి డీఎంహెచ్‌వో, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన క్షయవ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 66 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్యుడు కృష్ణతేజ, వైద్యురాలు లక్ష్మీప్రసన్న, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు ఉన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు చాంద్‌పాషా, టీయూసీఐ జిల్లా కార్యదర్శి దేవరాజులు పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో సంపద సృష్టికర్తలైన కార్మికులకు హక్కులు లేకుండా 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేసి కార్మికులకు అన్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు పోలు, శ్రీనివాస్, బ్రహ్మానందం, మల్ల య్య, అరుణ, సురేందర్, చిన్నయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

చెన్నూరు : నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల9న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చెన్నూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో కలిసి సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. సమ్మెలో అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకె రవి, శ్రీలత, రాజేశ్వరి, చందు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'సిగాచి' ప్రమాదంలో దండేపల్లి వాసి మృతి

స్వగ్రామంలో విషాదం



కుటుంబ సభ్యులతో నాగేశ్వర్‌రావు(ఫైల్)

దండేపల్లి/కాగజ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి రసాయన పరిశ్రమలో సోమవారం జరిగిన భారీ పేలుడులో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రానికి చెందిన వజ్జాకేశవుల నాగేశ్వర్‌రావు అలియాస్ రాజు (52) దుర్మరణం పాలయ్యాడు. దీంతో స్వగ్రామమైన దండేపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. నాగేశ్వర్‌రావు పదేళ్లుగా సిగాచి ఫ్యాక్టరీలో కెమికల్ ల్యాబ్‌లో క్వాలిటి సెల్ విభాగంలో పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం 9గంటలకు ఇంటి నుంచి విధులకు బయలుదేరిన 20 నిమిషాలకే పరిశ్రమలో పేలుడు సంభవించి నాగేశ్వర్‌రావు మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగేశ్వర్‌రావు కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం మిల్లులో పని చేశారు. 2014లో ఎస్పీఎం మిల్లు మూతబడిన తర్వాత తన కుటుంబ సభ్యులతో కలిసి పాశమైలారం ఫ్యాక్టరీలో పని చేసేందుకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. నాగేశ్వర్‌రావుకు భార్య హేమలత, తల్లి, ఇద్దరు కొడుకులున్నారు. పెద్దకొడుకు శ్రీవర్ధన్ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. చిన్నకొడుకు విశాల్ ఇంటర్ సెకండియర్ పూర్తి చేశాడు. బుధవారం దండేపల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇలు కాగజ్‌నగర్‌లోనూ అటు దండేపల్లిలోనూ అందరితో కలివిడిగా ఉండే నాగేశ్వర్‌రావు మృతి చెందిన విషయం తెలియడంతో మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

చుక్కల జింకపై కుక్కల దాడి



జింకకు చికిత్స చేస్తున్న పశు వైద్యులు, ఫారెస్ట్ అధికారులు

భీమిని, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో మంగళవారం కుక్కలు దాడి చేయడంతో ఓ చుక్కల జింక తీవ్రంగాగాయ పడింది. దారి తప్పి వచ్చిన జింకపై వీధి కుక్కలు తరుముతూ గ్రామ పొలిమేరలో పోచమ్మ దేవాలయం వద్ద వెంటపడి తరుముతూ గాయ పరుస్తున్న జింకను స్థానికులు గమనించారు. వీధి కుక్కల బారి నుంచి జింకను రక్షించి అటవీ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. బీట్ అధికారి గోపి వెంటనే గ్రామానికి చేరుకోని పశుసంవర్ధక శాఖ గోపాల మిత్ర తిరుపతి, మోను జింకకు చికిత్స అందించారు. అనంతరం అడివిలోనికి వదిలి పెట్టారు. ఈ సందర్భంగా జింకను కాపాడిన యువకులు ముత్యం రాజశేఖర్ గౌడ్, నైతం సందీప్, ముత్యం మల్లేష్ గౌడ్, పోతురాజుల సందీప్, ముత్తినేని సాయి, ఇందూరి రాజశేఖర్‌లను బీట్ అధికారి గోపి అభినందించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

బెల్లంపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన గాదం శ్వేత అనే మహిళ మెడలో నుంచి మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కొని వెళ్లారని తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శ్వేత ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లాడు. ఈ సమయంలో ఇంట్లో అత్తామామ ఇంటి ముందు నిద్రిస్తున్నప్పటికీ వారికి మెలుకువ రాలేదన్నారు. శ్వేత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో ఒకరికి 8 నెలల జైలు శిక్ష

మంచిర్యాలక్రైం జూ లై1(ఆంధ్రజ్యోతి): మోటర్‌సైకిల్ చోరీ చేసిన కేసులో గోదావరిఖనికి చెందిన దేవసహాయం సెల్వకు 8 నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ ఉపేందర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నస్పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో దేవసహాయం చోరీకి పాల్పడగా అప్పటి ఎస్ఐ సుగుణాకర్ కోర్టుకు రిమాండ్ చేయగా సాక్షాదారాలను నిరూపించడంతో ఫస్టు అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ మంచిర్యాల న్యాయమూర్తి కవిత నిందితుడికి 8 నెలల జైలు శిక్ష విధించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ తస్నీరు నాగరాజులను డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.



నవోదయం

- దరఖాస్తులకు ఈనెల 29 తుది గడువు
- డిసెంబరు 13న ప్రవేశపరీక్ష

కాగజ్‌నగర్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అధునాతన, నాణ్యమైక, క్రమశిక్షణ, క్రీడల్లో ప్రతిభతో పాటు అనేక సదుపాయాలతో విలువలతో కూడిన విద్యను అందించేందుకు కేంద్ర మానవవనరులశాఖ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో కాగజ్‌నగర్‌లో మాత్రమే నవోదయ విద్యాలయం ఏర్పాటైంది. ఇక్కడ కార్పొరేట్ విద్యకు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను బోధిస్తున్నారు. ఏటా అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతుండడంతో వారు దేశంలోనే ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిన నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ వెలువడిందని, ఆరోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్‌లైన్ పద్ధతిలో చేసుకోవాలని ప్రిన్సిపాల్ రేపాల క్రిష్ణ తెలిపారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు..

విద్యాలయంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నవోదయ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఇంటర్నెట్ ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేసుకోవచ్చు. పాఠశాలలో ఆరో తరగతిలో 80 సీట్లకు గానూ ఉమ్మడి జిల్లా నుంచి గతేడాది 5.900 దరఖాస్తులు వచ్చినట్లు విద్యాలయ అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు జూలై 29తేదీ ఆఖరు తేదీగా ప్రకటించారు, డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈఏడాది సులభతరంగా దరఖాస్తులను అప్‌లోడ్ చేసేవిధంగా మార్పులు చేశారని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా విద్యా బోధనతో పాటు కంప్యూటర్ విద్య, క్రీడలు, ల్యాబ్, లైబ్రరీ సౌకర్యం ఉంటుంది. అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఉండడంతో ఏటా 100 శాతం రిజల్ట్‌తో పాటు పూర్వ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ లాంటి అత్యున్నత స్థాయిల్లో ఉన్నారని నవోదయ విద్యాలయం అధికారులు తెలిపారు.

అర్హతలు.. రిజర్వేషన్ విధానం..

నవోదయ ప్రవేశ పరీక్షకు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన పాఠశాలలో ప్రస్తుతం ఐదో తరగతి చదు వుతున్న బాలిబాలికలు అర్హులు. వీరు 01.05.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించి ఉండాలి. పరీక్ష రాసే అభ్యర్థులు 3, 4, 5, తరగతులు గ్రామీణ ప్రాంతాల్లో చదవి ఉత్తీర్ణుల వ్వాలి.నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి రిజర్వేషన్ విధానం పక్కాగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి 75శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/3 వంతు రిజర్వేషన్ ఉంటుంది.

ప్రవేశాల కోసం దళారులను ఆశ్రయించొద్దు..: రేపాల క్రిష్ణ, ప్రిన్సిపాల్



విద్యాలయంలో ప్రవేశాల కోసం ఎలాంటి దళారులను ఆశ్రయించవద్దు. ప్రవేశాలు, ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుంది. మార్కుల ఆదారంగానే అడ్మిషన్స్ ఉంటాయి. కష్టపడి చదివితే సీటు సాధించడం సులభం. సీటు సాధించన వారికి అన్ని ఉచితంగానే అందుతాయి.

యువకుడి హత్య



శ్రీధర్‌చారి(ఫైల్)

పెంచికలపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన చెందిన దీకొండ శ్రీధర్‌చారి(25) అనే యువకుడు సోమవారం రాత్రి హత్యకు గురయ్యాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీధర్‌చారి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. రాత్రి 9 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అదే గ్రామానికి చెందిన పొట్టి రాజన్న ఇంటి వెనకాల పెరట్లో చారి మృతి చెంది ఉన్నాడని గ్రామస్థులు తెలిపారు. పదునైన మరణ ఆయుధంతో నరికి చంపినట్లు ఉందని చెబుతున్నారు. శ్రీధర్‌చారిని తాను చంపానని పొట్టి రాజన్న అనే వ్యక్తి పోలీసు స్టేషన్‌లో అర్ధరాత్రి లొంగి పోయాడు. ఘటన స్థలానికి సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కొమురయ్యలు చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యలు మాత్రం శ్రీధర్‌చారిని ఇంటికి పిలిపించి హత్యకు పాల్పడ్డారని చెబుతున్నారు. ఈ విషయమై సీఐ శ్రీనివాసరావును వివరణ కోరగా హత్య జరిగింది వాస్తవమేనని చెప్పారు. తల్లి దీకొండ సులోచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు. లొంగిపోయిన రాజన్నతో పాటు మరి కొందరిని అదుపలోకి తీసుకుని విచారిస్తున్నామని సీఐ తెలిపారు.

పారిశుధ్య సిబ్బందిని కేటాయించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాజంపేట గ్రామపంచాయతీకి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నుంచి వెంటనే పారిశుధ్య సిబ్బందిని కేటాయించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ, రాజంపేట గ్రామ పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పడే సమయంలో రాజంపేటను 10 వార్డులతో నూతన గ్రామ పంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో 1,750 మంది జనాభా ఉన్నారని, పారిశుధ్య సిబ్బందిని ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నుంచి కేటాయించలని తెలిపారు. మున్సిపాలిటీతో పాటు రాజంపేట గ్రామ పంచాయతీలో ప్రతి రోజు తడి, పొడిచెత్తలను ఇంటింటి నుంచి సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్ర పరుచాలని సూచించారు. ం పంచాయతీకి ట్రాక్టర్, చెత్తను తరలించే ట్రాలీలు అందించాలని తెలిపారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త లు చేపట్టాలని చెప్పారు. అవసరమైన ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని దోమల వృద్ధిని అరికట్టేందుకు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, డీఎల్‌పీవో ఉమర్‌హుస్సేన్, మున్సిపల్ కమిషన్ గజానంద్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

వనమహోత్సవంలో పాల్గొనాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్స వం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షిం చాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్, గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

సిర్పూర్(యు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించా లని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సిర్పూర్(యు) గ్రామ పంచాయితీ అధికారులు వనేమహోత్సవంలో భాగంగా ఇంటి స్థలంలో మొక్కలు నాటే కార్యక్రమంను ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఇంటి యాజమానులకు వివిధ రకాల మొక్కలను పంపిణి చేశారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కనక అవినాష్ మాట్లాడుతూ హోం స్టేడ్ ప్లాంటేషన్ కింద ప్రతీ ఇంటికి 6 మొక్కలు చొప్పున పంపిణీ చేసి ఇంటి ఆవరణలో నాటేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ చిట్యాల సంజీవ్, నిజార్,సెడ్మకి భీము తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): పవర్‌గూడ, రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం సిబ్బందితో కలిసి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిత, ఎంపీవో మోహన్, ఏపీఓ నగేష్, టెక్నీకల్ ఆసిస్టేంట్లు రాజలింగు, సురెందర్ రెడ్డి, ఆత్మరాం, గ్రామ కార్యదర్శులు బిసె భరత్, కోరేంగ ఆనంద్‌రావ్, ఫీల్డ్ ఆసిస్టేంట్లు ఆత్రం రవిందర్, ఉత్తం పాల్గొన్నారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

వాంకిడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి చేనులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరు మండలం రేచిని గ్రామానికి చెందిన వడై వెంకటి(40) వాంకిడి మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన తానుబాయిని వివాహం చేసుకున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం అలవాటు మానిపించాలనే ఉద్దేశ్యంతో భార్య గ్రామ మైన నార్లపూరకు తీసుకు వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా వెంకటి ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. కుటుంబ సభ్యులు మందలించేందుకు ప్రయత్నిస్తే ఉరేసుకుంటానని బెదిరింపులకు గురి చేసేవాడు. ఈ కర్మంలోనే సోమవారం సాయంత్రం వాంకిడికి వెళ్తానని చెప్పి బయటికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబీకులు బందువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం అదే గ్రామానికి చెందిన వడై సంతోష్ అనే వ్యక్తి చేను లో గల వేప చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య తానుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహిళల రక్షణకే ప్రాధాన్యం

ఆసిఫాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చిన్న పిల్లలు, మహిళల రక్షణే పోలీసు శాఖ తొలి ప్రాధాన్యం ఇస్తుందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా షీ టీం ద్వారా 86 హాట్స్పాట్లలో 22 అవేర్నెస్ ప్రోగ్రాంలు, 18 ఫిర్యాదులు స్వీకరించి 7 ఎఫ్ఐఆర్, 4 కేసులలో కౌన్సెలింగ్, 2 పిట్టి కేసులు నమోదు చేశామని చెప్పారు. మిగిలిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మహిళలు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, హింసకు గురైట్లయితే షీ టీంలను సంప్రదించాలన్నారు. జిల్లాలో ఎవరైనా మహిళలు, పిల్లలు హరాష్మెంట్‌కు గురైనట్లయితే పోలీసులను, షీ టీంలను నేరుగా సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు షీ టీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్ డివిజన్(8712670564), కాగజ్‌నగర్ డివిజన్ 8712670565) లేదా 100కు సమాచారం అందించాలని సూచించారు.

మేనేజర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే న్యూటెక్ గని మేనేజర్‌గా బదిలీపై వచ్చిన శ్రీనివాసులును టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, నాయకులు లాలా, గడ్డం మహిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు అధికారికి..

రెబ్బెన, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు చేపట్టిన గోలేటి ఓపెన్ కాస్టు అధికారి కృష్ణ ప్రసాద్‌ను మంగళవారం ఏఐటీయూసీ యూనియన్ బ్రాంచ్ సెక్రటరి ఎస్‌తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జగ్గయ్య, శేశశైనా రావు, జూపాక రాజేష్‌తో తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న అధికారికి..

రెబ్బెన, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా ఇంజనీర్‌గా పని చేసి బదిలీపై వెళ్లుతున్న అధికారి రామనాథంను బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి, ఏరియా అధికారులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షులు ఎంనరేందర్, ఎస్ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహర, డీజీఎం(వర్క్‌షాప్) కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

రెబ్బెన, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా 9వ తేదీన చేపట్టే సమ్మె నోటీసును మంగళవారం రెబ్బెన మెడికల్ అధికారి సుజీత్‌కు ఏఐటీయూసీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ సీపీఐ మండల కార్యదర్శి నర్సయ్య, ప్రమీల పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి



మాట్లాడుతున్న జీఎం దేవేందర్, పాల్గొన్న అధికారులు

మందమర్రిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ నెలలో 69 శాతం ఉత్పత్తిని సాధించామన్నారు. కేకే ఓసీపీలో ఓబీ తీయలేని కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిందన్నారు. భూగర్భ గనుల్లో కావాల్సిన ఎస్‌డీఎల్ స్పేర్స్, కావాల్సిన టబ్బులను పెంచడానికి దృష్టి సారించామన్నారు. హాలర్ బ్రేక్‌డౌన్ కాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వర్షాకాలంలో ఓసీపీల్లో చేరిన నీటిని తీసివేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికుల గైర్హాజరు వల్ల ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందని సింగరే ణిలో ఏ సంస్థలో లేని విధంగా ఎక్కువ వేతనాలు ఉన్నాయని, గైర్హాజరైతే వేతనాల నష్టపోతారని, దీంతో ఆర్థిక ఇబ్బందులు వస్తాయన్నారు. గైర్హాజరు కార్మికులకు విధుల పరంగా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్మికులు సక్రమంగా విధులకు హాజరు కావాలని సూచించారు. అదనపు ఉత్పత్తి సాధించడం ద్వారా సంస్థ లాభాల బాటలో నడుస్తుందని గమనించాల న్నారు. కార్మిక సంఘాలు సంస్థ స్థితి గతులు దృష్టిలో ఉంచుకుని సహకరించాలన్నారు. కార్మిక కాలనీలకు తాగునీటి అవసరాలు తీర్చే కేకే 5 గనిలో నీటి సరఫరాలో నిలిచిపోయిందని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని చతలాపూర్‌లో మూడు బోర్లు వేసి థౌజండ్ సీసీ పంపులను ఏర్పాటు చేశామన్నారు. కాసిపేట 1, 2 గనుల్లో స్టాండ్ స్టోవింగ్ డిప్లరింగ్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఐఈడీ ఎస్ఈ కిరణ్‌కుమార్, డీవైపీఎం ఆసిఫ్, సివిల్ ఎస్ఈ రాము, సీనియర్ పీవో శంకర్ పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు



మాట్లాడుతున్న సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి

రెబ్బెన, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలను ఉద్యోగులకు అందించేందకు కృషి చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి అన్నారు. గోలేటి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్ లావాదేవీలన్నీ సీకేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నట్టు తెలిపారు. మధ్యవర్తులు లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు. కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో సీఎంపీఎఫ్ కమిషనర్ గోవర్ధన్, బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, డీవైపీఎం రాజేశ్వర్, సీనియర్ పర్సన్ అధికారి ప్రశాంత్, సీఎంపీఎఫ్ ఉద్యోగులు మనోహర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌పై గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య, నాయకులు బోనాల శ్రీనివాస్, నామాల శ్రీనివాస్, కంబాల నరసయ్య, దుర్గం లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ నాయకుడు డి బ్రహ్మానందం, ఏఐఎఫ్‌టీ యూ నాయకుడు మేకల రాములు, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు సమ్మ రాజయ్య, నీరటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



వర్ష ప్రభావంతో తగ్గిన బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్, హాజరైన అధికారులు

శ్రీరాంపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్ష ప్రభావంతో గత జూన్ నెలలో శ్రీరాంపూర్ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాలోని న్యూటెక్ గని 106 శాతంతో ముందంజలో ఉందన్నారు. భూగర్భ గనుల్లో ఆర్‌కే 5 గని 93 శాతం, ఆర్‌కే 6 గని 73 శాతం, ఆర్‌కే 7 గని 82 శాతం, ఎస్ఆర్‌పీ 1 గని 92 శాతం, ఎస్ఆర్‌పీ 3 గని 58 శాతం, ఐకే 1ఏ గని 72 శాతం, ఉపరితల గనుల్లో శ్రీరాంపూర్ ఓసీపీ 93 శాతం, ఇందారం ఓసీపీ 89 శాతం ఓవరాల్‌గా 89 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయన్నారు. రైలు మార్గం ద్వారా 4లక్షల 60 వేల 693 టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 14 వేల 707 టన్నులు వినియోగదారులకు అందించామన్నారు. ఈ నెలకుగాను 4 లక్షల 89 వేల 300 టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని యాజమాన్యం నిర్దేశించిందని తెలిపారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనా రాయణ, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, పర్యావరణ అధికారి హన్మాన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం

శ్రీరాంపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల సేవలు అభినందనీయమని జీఎం శ్రీనివాస్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆర్‌కే 8 డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఉత్తమ వైద్యులుగా ఎంపికైన డాక్టర్ మురళీధర్, డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డిలకు జీఎం ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, డాక్టర్ మురళీధర్, డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి, ఆర్‌కే 8 డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అక్రమాలకు చెక్ పడేనా..?

(3వ పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు యాప్‌ల ద్వారా టీచర్లు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి అదనంగా ఫొటో క్యాప్చర్ విధానానికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రంలో హాజరయ్యే పిల్లలను ఒక్కొక్కరిగా ఫొటోలు తీసి యాప్‌లలో పొందు పర్చాల్సి ఉంటుంది. అలాగే గర్భిణులు, బాలింతలు భోజనం చేసే సమయంలోనూ ఇదే విధానం అమలు చేయాలి. తద్వారా ఎంత మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు హాజరవుతున్నారనే పక్కా సమాచారం ప్రభుత్వాలకు పక్కాగా చేరుతుంది. అయితే ఫొటో క్యాప్చర్ విధానం పిల్లల వరకు అయితే అమలు చేయవచ్చుగానీ, గర్భిణులు, బాలింతలకు సాధ్యపడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి రోజూ కేంద్రాలకు వచ్చి ఫొటో క్యాప్చర్ ఇచ్చేంత వెసులుబాటు వారికి ఉంటుందా...? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఒక్కొక్కరి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం కూడా అదనపు పనిభారమే అవుతుందనే అభిప్రాయాలను పలువురు టీచర్లు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బరువులు, ఎత్తులు తూచడం, వంట చేయించడం, వంటి పనులతో సమయం సరిపోవడం లేదని, కొత్తగా ఫొటో క్యాప్చర్ అమలు చేయడం ఎలా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ప్రభుత్వ నిర్ణయం పకడ్బందీగా అమలు అయితే అంగన్‌వాడీల్లో అక్రమాలకు చెక్ పడినట్లేనన్న అభిప్రాయాలు సైతం వినిపిస్తున్నాయి.

బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన

నెన్నెల, జూలై1 (ఆంధ్రజ్యోతి) : పొట్యాల గ్రామస్థులు బురదమయంగా మారిన రోడ్డుపై మంగళవారం వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగిన ప్రజలు రోడ్డు అధ్వానంగా మారినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంగళి శేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో పొట్యాల ప్రజలకు దారి కష్టాలు తప్పడం లేదన్నారు. కిలోమీటరు దూరం గుంతలు, బురదతో నడవలేని పరిస్థితిలో రోడ్డు ఉందన్నారు. అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్ కూడా గ్రామానికి రావడం లేదన్నారు. ఇప్పటికైనా పొట్యాలకు బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల మాజీ అధ్యక్షులు శైలెందర్‌సింగ్, నాయకులు నల్లి తిరుపతి, మోహన్, మహేందర్, సాగర్ పాల్గొన్నారు.

ఆదివాసీల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వాలు

వేమనపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆదివాసీల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మర్మల మల్లేశ్వరి ఆరోపించారు. మంగళవారం మండలంలోని బుయ్యారం గ్రామంలో జీవో నెంబరు 49ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే టైగర్ జోన్ పేరుతో ఆదివాసీల గూడాలను ఖాళీ చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. పెద్దపులుల సంరక్షణ పేరుతో ఆదివాసీలను అడవికి దూరం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మే 30న తాడోబా అందేరి రిజర్వు ఫారెస్టును కవ్వాల్ రిజర్వు ఫారెస్టును కలుపుతూ కొమురం భీం జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లోని 334 గ్రామాలను కలుపుతూ తీసుకువచ్చిన జీవో నెంబరు 49ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శంకర్, మొండి, నాగమల్లు, జయ పాల్గొన్నారు.

ఏజెన్సీ రైతులకు..

పట్టాపాసు బుక్కులు అందజేయాలి

కాసిపేట, జూలై1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన మందమర్రి కాసిపేట రైతులకు పట్టాపాసు బుక్కు అందజేయాలని కోరుతు ఆదివాసీ సంఘాల నాయకులు మంగళవారం ఐటీడీఏ పీవో కుష్బుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దిభార్గవ్ మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజన రైతులకు పట్టాపాసు బుక్కులు లేక ప్రభుత్వం అందించే పథకాలు అందడం లేదన్నారు. దీంతో రైతులు త్రీవంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రాజెక్టు అధికారి కుష్బు సాను కూలంగా స్పందించి అతి త్వరలో మంచిర్యాల జిల్లాలో పర్యటించి గిరిజన రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు రాజుకుమార్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, నాయకులు సోయం జంగు, అచ్యుత్‌రావు, నవీన్, కాసిపేట మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, రాజేశ్వర్, పల్లె పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

అనర్హులకు షట్టర్లు

డ్రా సమయంలో జేబులోంచి చిట్టీ తీస్తున్న

వీడియో సోషల్‌మీడియాలో వైరల్

బెల్లంపల్లి, జూలై1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్త వద్ద నూతనంగా నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్ షట్టర్లు అనర్హులకు కేటాయించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం 31షట్టర్లు ఉండగా మే 31న మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో వ్యాపారస్తులకు డ్రా పద్ధతిలో కేటాయించారు. అప్పటి నుంచి ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు షట్టర్ల కేటాయింపులో అనర్హులకు చోటు దక్కిందని రాస్తారోకోలు, నిరసనలు తెలిపారు. ఈ విషయంపై పలు మార్లు వ్యాపారస్తులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాలు సైతం అంద జేశారు. మంగళవారం సోషల్ మీడియాలో కలెక్టర్ సమక్షంలో షట్టర్లకు సం బంధించి డ్రా తీస్తున్న సమయంలో మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ ఉద్యోగి తన జేబులో నుంచి ఒక పేరు ఉన్న చిట్టీని కమి షనర్‌కు అందజేసినట్లు తెలుస్తోంది. దీంతో మున్సిపల్ కమిషనర్ తోకల మౌనికకు షట్టర్ కేటాయిస్తూ సమావేశంలో ప్రకటించారు. డ్రా తీస్తున్న సమయంలో డబ్బాలో నుంచి సీటి తాయాలేకాని జేబులో నుంచి సీటి తీయడంపై తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రమేశ్‌ను వివరణ కోరగా ఈ వీడియో తన దృష్టికి వచ్చిందని గతంలో విధులు నిర్వహించిన కమిషనర్ సమయంలో డ్రా పద్ధతిన షట్టర్లు కేటా యించారని దీనిపై విచారణ కొనసాగిస్తామన్నారు. అలాగే సోషల్ మీడియాలో కలెక్టర్ స్పందిస్తూ అతని జేబులోకి చీటి ఎలా వచ్చిందో అనే విషయంపై విచారణ సాగిస్తామని తెలిపారు.

చిత్తడి..చిత్తడి..



బురద దారిలో ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు పనులు
బురదమయంగా కోనంపేట రోడ్డు
రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

నెన్నెల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కోనంపేట ప్రజలకు వర్షంతో పాటు కష్టాలు మొదలయ్యాయి. తొలకరి వానలకే రోడ్డు బురదమయంగా మారింది. గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నిధులు మంజూరై పనులు కూడా ప్రారంభం కావడంతో ఇక తమ బాధలు తప్పుతాయని ఆ ప్రాంత ప్రజలు సంబురపడ్డారు. అనుమతులు లేవని అటవీశాఖ వారు పనులను అడ్డుకోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఎర్ర వాగు బ్రిడ్జి నిర్మాణం పనులు నడుస్తుండటంతో తాత్కాలిక వంతెన నిర్మించారు. అది చిన్నపాటి వర్షానికే కొట్టుకు పోతుండటంతో ప్రమాదకరంగా వాగు దాటాల్సి వస్తోంది. ఈ పాటికే ఒకసారి మట్టి వంతెన కొట్టుకు పోగా మరోసారి నిర్మించారు. ప్రస్తుతం రెండు వైపుల కోతకుగురై మరోసారి కొట్టుకుపోయేలా ఉంది. వర్షాకాలం మొత్తం కోనంపేట ప్రజలకు దారి కష్టాలు తప్పేలా లేవు.

దశాబ్దాల నుంచి వెంటాడుతున్న సమస్య..

కోనంపేట రోడ్డు నిర్మాణానికి అటవిశాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి. దశాబ్దాల నుంచి ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. మూడేళ్ల కిందట నెన్నెల నుంచి కోనంపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీరాజ్‌శాఖ నుంచి రూ. 3 కోట్లు మంజూరయ్యాయి. అటవీశాఖ నుంచి అనుతులు వచ్చే సరికి నిధులు వెనక్కి వెళ్లాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే గడ్డం వినోద్ కృషి చేశారు. ఐటీడీఏ నుంచి రూ. 3 కోట్లు మంజూరు చేయించారు.

టెండర్ ప్రక్రియ పూర్తి చేసి తీరా పనులు ప్రారంభం అయ్యాక అటవీ శాఖ వారు తాము పంచాయతీ రాజ్ శాఖకు అనుమతి ఇచ్చామని, ఐటీడీఏ నిధులతో పనులు ఎలా చేస్తారని అడ్డుకున్నారు. కొంత దూరం బీటీ, మరి కొంత దూరం మెటల్ రోడ్డు వేశారు. అనుమతులు లేక అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్లు పనులు చేయక పోవడంతో రోడ్డంతా బుదరమయంగా మారింది. రోడ్డు నిర్మాణం చేపట్టాలని రేంజీ కార్యాలయం ఎదుట అక్కడి ప్రజలు ధర్నాకు దిగినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.



బురదతో చిత్తడిగా మారిన కోనంపేట రోడ్డు

మూడు కిలోమీటర్లు ముప్పు తిప్పలు

మట్టి వేసి వదిలేయడంతో రోడ్డంతా చిత్తడిగా మారింది. ఒక్కో చోట రెండేసి అడుగుల లోతు గుంతలు ఏర్పాడ్డాయి. గుంతల్లో వరద నీరు నిలిచి రోజుల తర బడి ఉంటోంది. బైక్‌లపై వచ్చేవారు జారి పడుతు న్నారు. ఆటోలు ముందుకు కదలకపోవడంతో దిగి నెట్టాల్సి వస్తోంది. ఆటోలు ఈ రూట్‌లో రాకపోవడంతో కాలి నడకన మండల కేంద్రానికి రావాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభంలోనే ఇలా ఉంటే ముందుముందు ఎలాగోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

తాత్కాలిక వంతెనతో తిప్పలు

మండల కేంద్రంలోని లంబాడితండా సమీపంలోని ఎర్రవాగుపై వంతెన నిర్మాణం పనులు నడుస్తున్నాయి. తాత్కాలిక వంతెన నిర్మించినప్పటికీ వర్షం వస్తే అది కొట్టుకు పోతోంది. ఈ పాటికే మే 27న ఒకసారి కొట్టుకుపోయింది. వాగు ఉధృతి తగ్గినాక మరోసారి నిర్మించారు. ప్రస్తుతం ఇరు పక్కల కోతకు గురై వాగు వస్తే కొట్టుకు పోయేలా ఉంది. ఎర్రవాగు వస్తే కోనంపేటతో పాటు లంబాడితండా, మన్నెగూడం, కుర్మగూడెం, ఖర్జీ, జంగాల్‌పేట, దమ్మి రెడ్డిపేట ప్రజల రాకపోకలు నిలిచి పోతున్నాయి. వర్షం వచ్చిన రోజు ఆ ప్రాంతం పిల్లలు బడిమానే యాల్సిన పరిస్థితి ఉంది. అత్యవసర పనులున్న వారు ప్రాణాలకు తెగించి వాగు దాటాల్సి వస్తోంది. బ్రిడ్జి పనులు వేగం పెంచడంతో పాటు తాత్కాలిక వంతెన కోతకు గురికాకుండా ఇసుక బస్తాలతో అడ్డు గోడ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన ఎర్రవాగు తాత్కాలిక వంతెన

కాలినడకన నెన్నెలకు వచ్చాను: రెడ్డి భీమయ్య, కోనంపేట



కోనంపేటకు రోడ్డు లేక తిప్పలు అవుతోంది. మొదటి వర్షానికే రోడ్డంతా చిత్తడి అయింది. వాహనాలు నడిచే పరిస్థితి లేదు. దిగబడుతున్నాయని ఆటోలు ఈ రూట్లో తిప్పడం లేదు. గత్యంతరం లేక నడిచి వెళ్లాల్సి వస్తోంది. పది కిలోమీటర్లు కాలినడకన వెళ్లి నెన్నెల బ్యాంకు నుంచి రైతుభరోసా పైసలు తెచ్చుకున్నాను. రోడ్డు వేస్తేనే మా బాధలు తీరుతాయి.

వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి : సునార్కారి చంద్రయ్య, కోనంపేట



వర్షాకాలం వస్తే ఇక్కడి ప్రజలకు నరకం కనిపిస్తుంది. రోడ్డు బుదరమయం కావడంతో అత్యవసర పరిస్థితుల్లో 108 లాంటి వాహనాలు కూడా వచ్చే పరిస్థితి లేదు. నిధులు ఉండి కూడా రోడ్డు నిర్మాణం జరగడం లేదు. ఫారెస్టు వారు పనులను అడ్డుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అటవీ అనుమతులు తీసుకువచ్చి నిర్మాణం పనులు సత్వరం చేపట్టాలి.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మందమర్రిరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులిమడుగు గ్రామంలో ఎంపీడీవో రాజేశ్వర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం దశల వారీగా బిల్లులను అందజేస్తుందని, ఆందోళన చెందవద్దన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూర్ : తాండూర్‌లోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ 1, డే వాచ్ ఉమెన్ 1, స్కావెంజర్, స్వీపర్ 1 పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన మండలానికి చెందిన స్థానిక మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2 నుంచి 7వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి, డే వాచ్ ఉమెన్‌కు 10వ తరగతి, స్కావెంజర్, స్వీపర్‌కు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

కేసు నమోదు

జన్నారం, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలో కులంపేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అనూష తెలిపారు. తపాలపూర్ గ్రామానికి చెందిన దుర్గం దుర్గవ్వ కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయపొలానికి తొట్ల రాజమొగిలి ఇంటి ముందు నుంచి వెళ్లేవారు. సోమవారం దుర్గం దుర్గవ్వ, కొడుకు దుర్గం తేజతో కలిసి పొలానికి తొట్ల రాజ మొగిలి ఇంటి ముందు నుంచి వెళ్తుండగా తన ఇంటి ముందు నుంచి ఎందుకు వెళ్తున్నారని కులంపేరుతో రాజ మొగిలిని దూషించింది. దుర్గం దుర్గవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నంనూర్‌లో చోరీ

హాజీపూర్,జూలై 1(ఆంధ్ర జ్యోతి): మండలంలోని నంనూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చోరి జరిగింది. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన ఎలిగేటి పోచయ్య తన భార్య భాగ్యతో కలిసి ఉదయం మంచిర్యాలకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో బీరువా పగులకొట్టి ఉన్నట్టు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు తెలియజేస్తామని ఎస్ఐ తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం : సీపీ

మంచిర్యాలక్రైం, జూలై1 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయని అనుమతిలేని డ్రోన్, డీజే సౌం డ్స్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాధారణ పౌరులు మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మద్యం బహిరంగ ప్రదేశాల్లో సేవించడంపై నిషేదాజ్ఞలు పొడగిస్తామన్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

జైపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కుక్క మృతి చెందింది. కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న సుధీర్ విధులకు వెళ్తున్న క్రమంలో కుక్క రహదారిపై చనిపోయి ఉండటాన్ని గమనించాడు. రద్దీగా ఉండే రోడ్డుపై మిగితా వాహనాల కింద కుక్క శవం నుజ్జునుజ్జు కాకూడదని భావించి వెంటనే అక్కడకు వెళ్లి కుక్క కళేబరాన్ని రోడ్డుకు దూరంగా పడవేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో కానిస్టేబుల్ సుధీర్‌ను పలువురు అభినందించారు. మూగ జీవి అని నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తను చేసిన పనిని మెచ్చుకున్నారు.

వైద్యుల సేవలు ప్రశంసనీయం

ఘనంగా వైద్యుల దినోత్సవం



అవార్డు అందుకుంటున్న శ్రీవిద్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ దాసారపు శ్రీనివాస్

మందమర్రిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ వైద్యుడు రాపాక రమేష్‌ను మంగళవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా బీస్పీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం పాటు పడుతున్న వైద్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. నాయకులు కిరణ్ బాబు, శంకర్, మతిన్‌ఖాన్, రహీంబాబ పాల్గొన్నారు.

మందమర్రి: హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలోని కేర్ ఫౌండేషన్ నిర్వాహకులు మంగళ వారం డాక్టర్‌డే సందర్భంగా మందమర్రికి చెందిన శ్రీవిద్య ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ దాసారపు శ్రీనివాస్‌కు ఉత్తమ డాక్టర్ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం కేర్ ఆసుపత్రిలో ఆయనను సన్మానించి ఈ అవార్డును అందజేశారు. డాక్టర్ ప్రభాకర్ చౌటే , డాక్టర్ దిలీప్ బన్సాలి పాల్గొన్నారు.

చెన్నూరు : సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమం, ఆవోపా చెన్నూరు ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులను ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు పుల్లూరి సత్తయ్య, కమలాకర్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : మంచిర్యాలలో మంగళవారం కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో డాక్టర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. సేవా సమితి గౌరవాధ్యక్షుడు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దండేపల్లి : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సతీష్, వంశీకృష్ణలను దండేపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా పర్మనెంట్ ప్రాజెక్టు చైర్ పర్సన్ మాదం శెట్టి మల్లిఖార్జున్, మండల ప్రధాన కార్యదర్శి రాంచందర్, ఉపాధ్యక్షుడు రాజన్న, ప్రచార కార్యదర్శి సత్యం, నాయకులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

లక్షెట్టిపేట: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిండెంట్ ఆకుల శ్రీనివాస్ తోటి వైద్యులతో కలిసి కేక్ కట్ చేసి సిబ్బందికి స్వీట్స్ పంచి పెట్టారు. వైద్యులు కోటేశ్వర్, సురేష్, కృష్ణ, స్రవంతి, పవిత్ర పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జైపూర్ : జైపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్‌క్లబ్ జైపూర్ పవర్ ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యులు ముస్తాఫా, సింధూర, వేదశ్రీ, కమలాకర్‌లను సన్మానించారు. జైపూర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్ల సత్యనారాయణరెడ్డి, జనరల్ సెక్రటరీ మంతెన లక్ష్మణ్, లయన్స్‌క్లబ్ జాయింట్ సెక్రటరీ వెంకటేశం, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు అరుణ సుందరి, సెక్రటరి ఆదర్శ్ వర్ధన్ రాజు, ట్రెజరర్ శ్రీధర్, సభ్యులు ఎర్ర సువర్ణ, రాజన్న, పాల్గొన్నారు.

కెమికల్ పరిశ్రమలోని ప్రమాదంపై ..

న్యాయ విచారణ జరపాలి

బెల్లంపల్లి, జూలై1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని కెమికల్ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంపై న్యాయవిచారణ జరుపాలని ఐఎఫ్‌టీయు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా అన్నారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఫ్యాక్టరీలో తగిన రక్షణ చర్యలు లేకపోవడంతోనే ప్రమాదం సంభవించిందన్నారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, క్షతగాత్రులైన వారికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తూ రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎండీ జాఫర్, నాయకులు కనకయ్య, గణేష్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయు నాయకులు



రహదారివెడల్పు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రహదారి వెడల్పు పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

బెల్లంపల్లి, జూలై1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంసీ ఏరియా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్మించే రహదారి వెడల్పుపనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రమేశ్ పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మార్కింగ్ సంబంధిత సిబ్బందితో చేయించారు. అనంతరం పట్టణంలోని పలు నర్సరీలను పరిశీలించి మొక్కలను నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్‌సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

జైపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబుకు హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ ఆర్. విక్రమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌లు విన్నవించారు. వారు మాట్లాడుతూ కార్మికుల న్యాయ బద్ధమైన డిమాండ్లను, పెండింగ్ సమస్యలు, మౌలిక సదుపాయాలు, మెడికల్ ఫెసిలీటీలు, ఉద్యోగ భద్రత అంశాల గురించి డీజీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. డీజీఎం ఎస్టీపీపీ ఈడీ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్లకు స్థల పరిశీలన

దండేపల్లి జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్గనూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అందులపేట శివారులో సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు స్థలాన్ని డీఆర్డీవో కిషన్ పరిశీలించారు. ప్రవేశంలో బుష్ కటింగ్ (చెట్లు నరికివేత), భూమి చదునుకు వాటి ప్రణాళిక సిద్ధం చేసి ఉన్న తాధికారులు నివేదించాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

వేమనపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటి డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యుడు రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశడే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గర్భిణులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. గ్రామాల్లో డ్రైడే నిర్వహించాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు పరీక్షలు చేసి మందులను అందించాలన్నారు. డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలన్నారు. ప్రజలకు సికిల్ సెల్, అనిమియా టెస్టులను నిర్వహించాలని, రోగ నిర్ధారణ అనంతరం మం దులను అందజేయాలన్నారు. జిల్లా కమ్యూనిటీ అధికారి వెంకటేశ్వర్, వైద్యుడు రాజేష్, సూపర్ వైజర్ అపరంజి, బాపు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి విద్యార్థులకు తెలిసి ఉండాలని జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అనిత పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో కీటక జనిత వ్యాధుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనాఫిలిస్, క్యూలెక్స్, ఏడిస్ ఈజిప్టి అనే మూడు రకాల దోమలు మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, మెదడువాపు వ్యాధి, బోదకాలు వచ్చేందుకు కారణమవుతాయన్నారు. దోమల నిర్మూలనకు కృషి చేయాలని, ఇందుకోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు శివ ప్రతాప్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వో దీక్షి తరాణి, కళాశాల ప్రిన్సిపల్ అనూష, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ఏఎన్ఎం అంజలి ఉన్నారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు

ఆసిఫాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి జూలై 1 నుంచి 31 వరకు జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా, బహిరంగ సభలు తదితర ప్రజలు గుమికూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయకూడదన్నారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదన్నారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారి తీసే ఇబ్బందకర సమావేశాలు, జన సమూహంలాం టివి పూర్తిగా నిషేధమని తెలిపారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు ప్రచార రథాలు, మైకులు, అధిక శబ్ద పరికరాలు నిషేధించామని తెలిపారు.

కౌలు పత్రాన్ని ఏఈవోలకు అందజేయాలి

కాగజ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు కౌలు పత్రాన్ని ఏఈవోకు అందజేయాలని వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. పీఏసీఎస్‌లో ఎరువులను వ్యవసాయాధికారి రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ నానో యూరియా వినియోగంతో పంట దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు సూచనలు పాటించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

- నేటి నుంచి ప్రారంభం
- సమాచారం ఇవ్వకుండానే కేంద్ర బృందం పరిశీలన
- నెల రోజుల పాటు ప్రక్రియ
- ఉత్తమ గ్రామాలకు ర్యాంకులు, పురస్కారాలు



పల్లెల్లో స్వచ్ఛతపై సర్వే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) గ్రామాలన్నీ స్వచ్ఛంగా విలసిల్లాలనే సంకల్పంతో స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు గ్రామ పంచాయతీల్లో కేంద్ర బృందం బుధవారం సర్వే నిర్వహించనుంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అకాడమి ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ అనే సంస్థ నుంచి పలువురు ప్రతినిధులు పర్యవేక్షణకు రానున్నారు. చెత్త సేకరణ తీరు, పారిశుధ్య సిబ్బంది చెత్త తరలింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు తదితర అంశాలపై నేరుగా ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరిస్తారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయా గ్రామపంచాయతీలసిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

● ప్రగతి పనులపై ఆరా..

ఆయా గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి, ప్రగతి పనులపై అధికారులు పంపిన నివేదికల ఆధా రంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాలన్నింటినీ పరిశుభ్రంగా మార్చాలనే ఉద్దేశ్యంతో పంచాయతీల మధ్య స్నేహ పూర్వకమైన పోటీ తత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తూ సర్వే నిర్వహిస్తారు. సర్వేలో భాగంగా మొత్తం 1,000 మార్కులకు ఈ పోటీ నిర్వహిస్తున్నారు. మెరుగైన ర్యాంకులు సాధిస్తే జాతీయస్థాయిలో పురస్కారం అందజేస్తారు. ఇంటింటికి మరుగుదొడ్డి నిర్మించుకున్నారా దానిని వినియోగిస్తున్నారా, పారిశుధ్య సిబ్బంది నిత్యం చెత్త సేకరిస్తున్నారా, ఇంకుడు గుం తలు ఉన్నా యా, యార్డుల్లో వ్యర్థాల నిర్వహిణ అమలు, పచ్చదనం పెంపు, శుద్ధమైన తాగునీటి సరఫరా అంగన్‌వాడీ కేంద్రం ప్రభుత్వ పాఠ శాల, బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్య పరి స్థితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలు గ్రామాల్లో ఎలా నడుస్తున్నాయి తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని సర్వే చేస్తారు. అయా అంశాల అదారంగా వేయి మార్కులు కేటాయిస్తారు. ఎక్కువ మార్కులు సాధించిన పంచాయతీలకు స్వచ్ఛ ర్యాంకులను ప్రకటిస్తారు.

● ఎంపిక చేసిన గ్రామాల్లో..

పంచాయతీల్లో కేంద్ర బృందం ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసి సర్వే చేపట్టనుంది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమాచారం ఆధారంగా ఏ గ్రామాలకు వెళ్లలనేది నిర్ణయిస్తారు. గ్రామంలో 16 ఇళ్లను సందర్శించి వారి అభిప్రాయాలు తీసుకొని పరిశీలిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర గృహాల సభ్యులతో సర్వే చేస్తారు. అనంతరం సర్వేలో తెలిన అంశాల నివేదికను కేంద్రానికి పంపుతారు. జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రానున్న సందర్భంగా ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉన్నారు. గ్రామాల్లో స్వచ్ఛ వాతావరణం నెలకొనేలా పంచాయతీ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతాం..

- భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి



స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా గ్రామాలను సర్వే చేసేందుకు త్వరలో కేంద్ర బృందాలు జిల్లాకు రానున్నాయి ఈ బృందాలు ఏ సమయంలో ఏ గ్రామంలో పర్యటించే సమాచారం ఉండదు. అప్పటికప్పుడు బృందాలు గ్రామాలను సందర్శిస్తాయి. ఈ నేపథ్యంలో అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీకి సిద్ధం చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఇప్పటికే సూచనలు చేశాం.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

వాంకిడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మల్టీ పర్పస్ సెంటర్లలో అన్ని విధాల సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. వాంకిడి మండలం ఖిరిడి గ్రామ పంచాయతీలోని లింబుగూడలో మంగళవారం ఆయన పర్యటించారు. పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా నిర్మించిన మల్టీపర్పస్ సెంటర్లలో అంగన్‌వాడీ, హెల్త్ ఆఫీస్‌లకు కావాల్సిన అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయుటకు కావాల్సిన ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఐటీడీఏ ఏఈని ఆదేశించారు. అనంతరంసెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట డీటీడబ్ల్యూవో రమాదేవి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో ఖాజా అజీజోద్దీన్, ఏపీరవో శ్రావణ్‌కుమార్, ఈసీ మోసిన్, ఏఈ నజీముద్దీన్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి



అటవీశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని సిర్పూరు నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ మంగళవారం అటవీశాఖ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టాలున్నప్పటికీ కూడా అటవీ శాఖ అధికారులు పోడు రైతులను వేధిస్తున్నట్టు తెలిపారు. పెంచికల్‌పేట మండల పోతేపెల్లిలో రైతులకు పట్టాపాస్ బుక్‌లున్నా కూడా పోడును అడ్డుకుంటున్నారని, మంత్రి సీతక్క స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పోడు రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సేవ అభినందనీయం

సిర్పూర్(టి), జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు సేవ చేయడం అబినందనీయమని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. సిర్పూర్(టి) మంలం వెంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు మంగళవారం బ్యాగులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేసే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు సొంత నిధులతో పేద విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంఈవో వేణుగోపాల్ రావు, ఎంపీడీవో సత్యనారాయణ, యూటీఎఫ్ మండలా ధ్యక్షుడు హరీష్, సీఆర్పీ పవన్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వాంకిడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన నాయిని మనోహర్(45) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 26న వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన మనోహర్ మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పందుతూ మృతి చెందాడు. మనోహర్ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత

కాగజ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు అక్రమంగా దేశీదారు మద్యం తరలిస్తుండగా, సోమవారం రాత్రి పట్టుకున్నట్టు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. సమాచారం మేరకు వాహనాలు తనిఖీలు చేశామని చెప్పారు. ఈ మేరకు అటుగా వస్తున్న కారును తనిఖీ చేయగా 17 కార్టన్ల దేశీదారు లభించిందన్నారు. వీటి విలువ రూ.68వేల వరకు ఉంటుందని తెలిపారు. దేశీదారును స్వాధీనం చేసుకుని, కౌటాలకు చెందిన దుర్గం సాయిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. తనిఖీల్లో ఎస్సై భానంద్, కానిస్టేబుళ్లు కుమార్, రాజ్‌కుమార్, హుస్సేన్, మండల్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

కెరమెరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనార్‌పల్లి ఎక్స్ రోడ్డు మంగళవారం వాహనాల తనిఖీల్లో భాగంగా సోములగూడకు చెందిన రాథోడ్ అర్జున్ ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న పది లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, పాల్గొన్న నాయకులు

ఆసిఫాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండయిన సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావిశ్రీనివాస్ మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ రావిశ్రీనివాస్‌రావును పార్టీ నుంచి సస్పెండు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో రంగులు మార్చే ఊసరవెల్లిలా పార్టీలు మార్చిన శ్రీనివాస్‌కు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిందన్నారు. ఆదివాసీ మంత్రిని కించపరిచేలా మాట్లాడటం ఆయన దురహంకారానికి నిదర్శమని డీసీసీ అధ్యక్షుడు విమర్శించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తే కనీసం జడ్పీటీసీకి రావాల్సిన ఓట్లు కూడ తెచ్చుకొలేదని ఎద్దెవా చేశారు. అటువంటి వ్యక్తి మంత్రిని, ఎన్నికల్లో ఆదిలాబాద్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన సత్తు మల్లేష్‌ను విమర్శించే అర్హత రావి శ్రీనివాస్‌కు లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్ మాట్లాడుతూ . జైనూరులో గతంలో జరిగిన గొడవలకు మంత్రిని బాధ్యురాలిగా చేస్తూ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆదివాసీల తడఖా చూపుతామని హెచ్చరించారు. మంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసిన రావి శ్రీనివాస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్లు గాదవేణి మల్లేష్, మునీర్ అహ్మద్, ఆర్టీఏ సభ్యులు రమేష్, మాజీ జడీపటీసీ ఆత్రం లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చరణ్, గుండా శ్యాం, వసంత్‌రావు, దత్తు, నారయణ, రఘు, గోపాల్‌నాయక్, గోవంద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

వాంకిడి/బెజ్జూరు/రెబ్బెన జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం వాంకిడి ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేస్తున్న వైద్య అధికారులు డాక్టర్ వినయ్, డాక్టర్ రిషికను లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అవినాష్, సభ్యులు పాల్గొన్నారు. బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ అవినాష్‌ను సిబ్బంది శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు. గోలేటిలో మంగళవారం డాక్టర్స్, పోస్టల్ వేడుకలు లయన్స్ క్లబ్ గోలేటి స్పోర్ట్స్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోలేటి డిస్పెన్సరి డాక్టర్ ఎం.మురళి, ఫార్మాసిస్టు గంగాధర్‌తో పాటు పోస్టు ఉమెన్ కృష్ణవేణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లయన్ అన్నం రమేష్, సెక్రటరి మారిన చందర్, అడ్మినిస్ట్రేటివ్ భాస్కర్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

జైనూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని అదిమ గిరిజన కొలాం సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఆత్రం రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదిమ గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు ఆత్రం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మంగళవారం ఇటీవల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన వేణుగోపాల్, శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సదాశివ్‌లను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, నాయకులు బాలేష్‌గౌడ్, మల్లేష్, చరణ్, శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించాలి



నోటీసులు అందజేస్తున్న ఎస్సై కమలాకర్, ఈవో తిరుపతి

సిర్పూర్(టి), జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ఇరువైపులా ఆర్ అండ్‌బీ స్థలంలో అక్రమంగా నిర్మించిన షెడ్లను స్వచ్ఛందంగా తొలగించాలని మంగళవారం గ్రామ పంచాయతీ ఈవో తిరుపతి, ఎస్సై కమలాకర్ యజమానులకు నోటీసులు అందజేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నందున అక్రమంగా వేసి షెడ్లను తొలగించాలని చెప్పారు. వారి వెంట జీపీ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బుద్ధ విహార్‌ను బౌద్ధులకు అప్పగించాలి

వాంకిడి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయలోని మహాబోధి బుద్ధ విహార్‌ను బౌద్ధులకు అప్పగించాలని మండల కేంద్రంలో బౌద్ధ ఉపాసకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్, నాయకులు దుర్గాజీ, జయరాం, రోషన్, అరుణ్, రాజేంద్రప్రసాద్, రమేష్, మనోజ్, నూతన్, వివేక్, సురేందర్, చింటూ, ప్రశాంత్, స్వాగత్, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు పంపిణీ



దహెగాంలో యూరియా తీసుకెళుతున్న రైతులు

దహెగాం/కౌటాల. జూలై 1 (ఆంధ్రజ్యోతి): దహెగాం, కౌటాల మండలాల్లో మంగళవారం అధికారులు రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. దహెగాం మండలం బీబ్రా గ్రామంలో ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం యూరియా పంపిణీ చేశారు. దేవాజీగూడ, జెండాగూడ, కోత్మీర్, బీబ్రాతో పాటు పలు గ్రామాల రైతులు తరలి వచ్చి యూరియా కోసం లైన్లలో నిలుచున్నారు. ఎకరానికి రెండు యూరియా బస్తాల చొప్పున పంపిణీ చేశారు. 444 యూ రియా బస్తాలను లారీలో నుంచి రైతులకు సంబంధించిన ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లలో నే రుగా పంపిణీ చేశారు. యూరియా కొరత ఉందని ప్రచారం కావడంతో రైతులు పెద్ద సం ఖ్యలో అక్కడికి చేసుకున్నారు. కేవలం మూడు గంటల్లో యూరియా పంపిణీ పూర్తైంది. కౌటాల, చింతలమానేపల్లి మండలాల రైతులు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం యూరియా టోకెన్లు ఇచ్చేందుకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేయడంతో రైతులు బారులు తీరారు. ప్రభుత్వం ద్వారా ఒక్కో యూరియా బస్తాకు రూ.270 ఉంది. వ్యాపారులు మాత్రం రూ.350 నుంచి రూ.450 వరకు విక్రయిస్తున్నారని చెప్పారు. దీంతో రైతులు సబ్సిడీ యూరియా కోసం బారులు తీరుతున్నారు. ఒక్కో ఎకరానికి రెండు యూరియా బ్యాగుల చొప్పున అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్టాదారు పుస్తకాలు లేని రైతులు తప్పని పరిస్థితుల్లో వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సిందేనని చెబుతున్నారు. రైతులకు సరిపడా యూరియా బస్తాలు అందిస్తామని ఏవో ప్రేమలత తెలిపారు.



కౌటాల రైతు వేదికలో ఎరువుల కోసం వచ్చిన రైతులు

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా..

బెజ్జూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి నుంచి పెంచికలపేట వెళ్లే ప్రధాన రహదారి వర్షాలకు బురదమయంగా మారడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తెలంగాణ ఆవిర్భవించిన తొలి నాళ్లలో వేసిన రోడ్డు ఇది. రోడ్డు వేసి దశాబ్దం కావస్తుండడంతో గుంతలమయంగా మార వాహనాల రాక పోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇటీవల రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో మొరం వేయడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో వేసిన మొరం పూర్తిగా బురద మయంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. గతంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు సైతం మంజూ రైనప్పటికీ అటవీ అనుమతులు లేవన్న కారణంతో పనులు నిలిచిపోయాయి. ఇక వర్షాకాలం ముగిసే వరకు ఇబ్బందులు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



బురదమయంగా మారిన రోడ్డు

వారసంత బురదమయం



దహెగాంలో బురదలో కొనసాగుతున్న వారసంత

దహెగాం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలో మంగళవారం నిర్వ హించిన వారసంత బురదమయం కావడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బం దులు పడ్డారు. మూడు రోజులుగా ముసురు వర్షం కురుస్తుండడంతో వారసంత నిర్వహి ంచే ప్రదేశంలో నీరు నిలిచి బురదమయంగా మారింది. వారసంతకు పెంచికల పేట, కాగజ్‌నగర్, దహెగాం మండలాల నుంచి కూరగాయలు, వస్త్ర వ్యాపారులు వస్తుంటారు. వారసంత ప్రదేశంలో సరైన వసుతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. బురదలోనే విక్రయాలు కొనసాగడంతో ప్రజలు సైతం అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● సంక్షిప్తం..

● వాంకిడి, (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలను అడవి నుంచి వెళ్లగొట్టే జీవో 49ని ప్రభుత్వం ఉపసంహరించుకోవలని తెలంగాణ ఆదివాసీ సంఘం నాయకులు తహసీల్దార్ కవితకు మంగళవారం వినతి పత్రం అం దజేశారు. కార్యక్రమంలో అశోక్, శ్రీనివాస్, పగ్గు, అన్నిగా పాల్గొన్నారు.

● కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గతంలో నాటు సారా, దేశీదారు విక్రయించిన ఎనిమిది మందినితహసీల్దార్ మధూకర్ ఎదుట ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో బైండోవర్ చేశారు. దేశీదారు మద్యం దందా మళ్లీ కొనసాగిస్తే లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని సీఐ తెలిపారు.

● చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): ఆడెపల్లి, డబ్బా, బాలాజీ అనుకోడ, చింతలమానేపల్లి తదితర గ్రామాల్లో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఏఈ సాహెల్, మాజీ సర్పంచ్‌లు ప్రసాద్, సంతోష్, నాయకులు శ్రీనివాస్, కార్యదర్శి ఆసీఫ్ అలీ పాల్గొన్నారు.